క్లుప్తంగా

ఓబుళరాజుకండ్రిగలో పశువైద్య శిబిరం

నింద్ర: పశువులకు టీకాలు వేయించి రోగాల నుంచి కాపాడుకోవాలని అరూరు పశు ఉప కేంద్రం వైద్యాధికారి ప్రభాకర్ వర్మ తెలిపారు. మండలంలోని ఓబుళరాజుకండ్రిగలో గురువారం పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు సీజనల్ వ్యాధులకు సంబంధించి టీకాలు వేశారు. చికిత్స చేశారు.

పశువులకు వ్యాక్సినేషన్


మూగజీవాలకు టీకాలు వేస్తున్న వైద్యాధికారి

విజయపురం: మండలంలోని ఇల్లత్తూరు, గొల్లపిల్ల గ్రామాల్లోని పశువులకు గురువారం పశువైద్యాధికారి శివమూర్తి వ్యాక్సిన్ వేశారు. జాతీయ పశువ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా సుమారు 50కి పైగా మూగజీవాలకు గాలికుంటు, నట్టల నివారణ టీకాలు వేశారు. ముందుగా వ్యాక్సిన్ వేయడం ద్వారా మూగజీవాలను వ్యాధుల నుంచి రక్షించుకోవచ్చని సూచించారు. ముఖ్యంగా తీవ్రమైన జ్వరం, నీరసం, నోటి నుంచి తీగలా చొంగ కారడం, నోరు, కాలిగిట్టల మధ్య పుండ్లు ఏర్పడడం, కొద్దిపాటి ఎండకు కూడా రొప్పడం వంటివి వాటి నుంచి కాపాడుకోవచ్చన్నారు.

వాహనాల తనిఖీ

నింద్ర: మండల కేంద్రమైన నింద్రలో గురువారం పోలీసులు వాహనాల తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. రికార్డులు లేని వాహనాలకు జరిమానా విధించారు. వారు మాట్లాడుతూ వాహనదారులకు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు.

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి



ట్యాంకు వద్ద ట్యాప్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కార్వేటినగరం: గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ చంద్రమౌళి అన్నారు. గురువారం మండల పరిధిలోని డీఎం పురం పంచాయతీలో తాగునీటి ట్యాంకులను సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందని ప్రజలు ఫిర్యాదు చేయకుండా చూడాలని, కార్యదర్శులు సచివాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి తాగునీటి పైపులైన్ల లీకేజీలను గుర్తించి మరమ్మతులు చేపట్టాలని సూచించారు. అదే విధంగా వేసవి నేపథ్యంలో విద్యుత్ సమస్యలతో పంచాయతీ మోటార్లు మరమ్మతులకు గురికాకుండా ఎప్పటికప్పుడు పరిశీలించాలని కోరారు.

వైభవంగా కుంభాభిషేకం


పుష్పపల్లకిలో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లు

పాలసముద్రం: మండలంలోని సింహరాజుపురం దళితవాడలోని శ్రీకృష్ణ దేవాలయంలో నాలుగో వార్షిక కుంభాభిషేకంలో భాగంగా గురువారం స్వామివారికి ప్రత్యేక పూజలు, మహిళలు పాల బిందెలతో ఊరేగింపు, స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ప్రతి ఇంటి నుంచి మహిళలు పాలబిందెలతో ఊరేగింపు చేశారు. యాగశాలలో కళశం పెట్టి గణపతి హోమం, శాంతి హోమం చేశారు. అనంతరం స్వామి అమ్మవార్లను పుష్పపల్లకిలో పుర వీధుల్లో ఊరేగింపు చేపట్టారు.


పాల బిందెలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

నోటీస్ బోర్డు

8న లోక్ అదాలత్

నగరి: ఈ నెల 8న నేషనల్ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జడ్జి గోపాలకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు రైతు కార్డుల నమోదు

మండలంలోని బాలక్రిష్టాపురం, వనదుర్గాపురం, పాలసముద్రం రైతు సేవా కేంద్రంలో శుక్రవారం రైతులకు విశిష్ట కార్డుల నమోదు కార్యక్రమం నిర్వహించారు. రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఫోన్ తీసుకెళ్లి నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి డిల్లీప్రసాద్ తెలిపారు.

నరసింహపురంలో 104 సేవలు

మండలంలోని నరసింహపురం పంచాయతీలో శుక్రవారం 104 వైద్య సేవలు నిర్వహిస్తారని పీహెచ్‌సీ వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ తెలిపారు. నరసింహపురం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉచిత బస్సు.. తుస్సు

హామీలు ఇచ్చి ప్రజలను ప్రలోభ పెట్టడం.. అధికారంలోకి వచ్చాక ఆ హామీలతో తనకేంటి సంబంధం అన్నట్లు వాటిని అటకెక్కించడం నారా చంద్రబాబునాయుడుకు వెన్నతో పెట్టిన విద్య. 2014లో 600లకు పైగా హామీలు ఇచ్చి మోసం చేశారు. మళ్లీ 2024లో సూపర్ సిక్స్ పేరు హామీలు ఇచ్చారు. ముఖ్యంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణమని ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్నా ఉచితం బస్సు తుస్సు అని తేల్చేశారు. తాము మరోసారి మోసపోయామని మహిళలు వాపోతున్నారు.



- ఉచితం ఉత్తుత్తిదేనా అంటూ నివ్వెరపోతున్న మహిళలు
- చంద్రబాబు మాటలు నమ్మి మోసపోయామని ఆవేదన

నగరి: సార్వత్రిక ఎన్నికల హామీల్లో భాగంగా చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ పథకాల గురించి పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. ప్రధానంగా మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఆడబిడ్డ నిధి, దీపం పథకం (ఉచిత గ్యాస్ సిలిండర్లు), తల్లికి వందనం వంటి పథకాలను చేర్చారు. కూటమి అధికారంలోకి వచ్చి 9 నెలలు గడిచిపోయినా ఈ పథకాల్లో ఏవీ అమలు చేయలేదు. ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం ప్రారంభించేశామని చెప్పుకోవడానికే తప్ప క్షేత్రస్థాయిలో అమల్లో ఉందో లేదో పాలకులకే తెలియాలి. తాజాగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025–2026 వార్షిక బడ్జెట్లో ఉచిత బస్సు ప్రయాణం, ఆడబిడ్డ నిధి పథకాలకు పూర్తిగా మొండి చేయి చూపింది. ఉచిత బస్సు ప్రయాణం పథకానికి రూపాయి కూడా కేటాయించకుండా తమకు ఈ పథకం అమలు చేసే ఉద్దేశం లేదని చెప్పకనే చెప్పారు. దీంతో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తామన్న కూటమి నేతల హామీ తుస్సయింది.

ఇదిగో ఇచ్చేశాం..
అదిగో వచ్చేసింది అబ్రకదబ్ర

కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ఇదిగో ప్రారంభించేస్తామ న్నట్లు నాయకులు మీడియా ద్వారా తరచూ లీకులు ఇచ్చారు. ఒక్కోమంత్రి ఒక్కో తేదీని ప్రకటించేశారు. ఒకరు 2024 ఆగస్టు 15న ప్రారంభించేస్తామని చెబితే, మరికొందరు మంత్రులు దసరా, దీపావళి, సంక్రాంతి అంటూ తేదీలు మార్చుతూ వచ్చారు. ఆఖరికి ఈపథకం అమలు కోసం ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. రవాణా శాఖ మంత్రి చైర్మన్‌గా, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి, హోంమంత్రి సభ్యులుగా సబ్‌కమిటీ ఏర్పాటైంది. వీరు ఉచితబస్సు ప్రయాణం పథకం అమలవుతున్న తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, పంజాబ్, ఢిల్లీ రాష్ట్రాల్లో పర్యటించి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీ అధ్యయనం చేసిందో లేదో ఎవరికీ తెలియదు. నివేదిక ఇచ్చిందో లేదో కూడా తెలియదు. ఇప్పటి వరకు ఆ పథకం గురించి ఎలాంటి సమాచారాన్ని ప్రభుత్వం ప్రకటించలేదు. నగరి నియోజకవర్గంలో 1,21,848 మంది మహిళలు ఉన్నారు. వీరంతా ఉచితబస్సు ప్రయాణ పథకాన్ని ప్రభుత్వం ఎప్పుడు అమలు చేస్తుందా అని ఎదురుచూస్తున్నారు.

మహిళా ఓటర్ల వివరాలు

మండలం	మహిళలు
నగరి	42384
పుత్తూరు	34569
విజయపురం	15267
నింద్ర	13713
వడమాలపేట	15915

ఇంకెప్పుడు అమలుచేస్తారు



ఉచిత బస్సు, ఆడబిడ్డ నిధి పథకాలకు బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. ఈ పథకాలను ఇంకెప్పుడు అమలుచేస్తారో ప్రభుత్వ పెద్దలు చెప్పాలి. అధికారం కోసం ఇష్టారీతిగా హామీలు ఇవ్వడం, తర్వాత వాటిని అటకెక్కించడం సరికాదు. ఏ పథకానికి ఎంత ఖర్చు అవుతుందన్న సంగతి ఎన్నికల్లో హామీ ఇచ్చినప్పుడు తెలియదా? అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదని కుంటిసాకులు చెప్పడం సిగ్గుచేటు. కూటమి ప్రభుత్వం మహిళలను మోసం చేసింది.

–అముద, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు, నగరి

ఇళ్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తులు

వడమాలపేట (విజయపురం): వడమాలపేట మండలంలో 2019కి ముందు ప్రభుత్వ, అనాధీన భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారు క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ జరీనా కోరారు. ఆమె గురువారం విలేకరులతో మాట్లాడుతూ వివాద రహిత ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి ప్రభుత్వం క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించిందన్నారు. ఆయా సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని, స్లాబ్ మేరకు రిజిస్ట్రేషన్ రుసుము చెల్లించాలన్నారు. ఆర్‌సీసీ పైకప్పుతో ఇళ్లు నివాసయోగ్యమై ఉండాలన్నారు. ఇంటి పన్ను, తాగునీటి పన్ను, విద్యుత్ బిల్లులు వంటి ఆధారాలతో ఈనెల 31లోగా ఆయా పరిధిలోని సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్‌లకు దరఖాస్తులు అందజేయాలన్నారు.

నాగ వాహనంపై ఊరేగిన సుబ్రహ్మణ్యేశ్వరుడు


నాగ వాహనంపై స్వామి వారు

పుత్తూరు: పట్టణంలోని శ్రీ వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి 53వ బ్రహ్మోత్సవాల ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం స్వామి వారు నాగ వాహనంపై భక్తులకు దర్శనం మిచ్చారు. ఉదయం ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేశారు. అలాగే ఆలయ ప్రదక్షిణం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎం సుందరం, అర్చకులు ఎస్ రవిచంద్రన్ గురుకుల్, ఆర్ శరవణన్ తదితరులు పాల్గొన్నారు.

స్థలాల ఆక్రమణల క్రమబద్ధీకరణ

నగరి: అనధికార ఆక్రమణలను క్రమబద్ధీకరణ చేసుకునేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్డీవో భవానీ శంకరి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 2019 అక్టోబరు 15కు ముందు ఆక్రమించుకున్న స్థలాల్లో చేపట్టిన నిర్మాణాలు నిబంధనలను అనుసరించి క్రమబద్ధీకరణ చేస్తామని తెలిపారు. ఆర్‌సీసీ రూఫ్ గానీ, ఇటుక గోడలతో కూడిన ఆస్‌బెస్టాస్ రూఫ్‌గానీ ఉండాలని వెల్లడించారు. లబ్ధిదారు లేదా వారి కుటుంబ సభ్యులు గృహ నిర్మాణ పథకంలో లబ్ధిదారులుగా ఉండకూడదని, మహిళల పేరుతోనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆక్రమిత స్థలంలో నివాసం ఉన్న కుటుంబానికి నెలసరి విద్యుత్ వినియోగం 300 యూనిట్ల కంటే తక్కువ ఉండాలని తెలిపారు.


ఆర్డీవో కార్యాలయం

మినహాయింపులు, రాయితీలు ఇలా..

– ఆక్రమిత స్థలం 150 చదరపు గజాలలోపు ఉంటే వారికి డి పట్టాతో పాటు కన్వేయన్స్ డీడ్ ఉచితంగా ఇస్తారు. రెండేళ్ల తరువాత ఆస్తిని అమ్ముకునే హక్కు కూడా కల్పిస్తారు.

– 151 నుంచి 300 చదరపు గజాల ఆక్రమిత స్థలంలో ఇల్లు కట్టుకొని ఉంటే వారు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారైతే ప్రాథమిక విలువలో 15 శాతం చెల్లించి 50 శాతం ఫీజు రాయితీపై రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు, దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్న వారైతే ప్రాథమిక విలువలో 15 శాతం చెల్లించి రిజిస్ట్రేషన్ ఖర్చులు పూర్తిగా భరించాల్సి ఉంటుంది.

– 301 నుంచి 450 వరకు చదరపు గజాల ఆక్రమిత స్థలంలో ఇల్లు కట్టుకొని ఉంటే వారు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారైతే ప్రాథమిక విలువను పూర్తిగా చెల్లించి 50 శాతం ఫీజు రాయితీపై రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్న వారైతే ప్రాథమిక విలువలో 200 శాతం చెల్లించి రిజిస్ట్రేషన్ ఖర్చులు పూర్తిగా భరించాల్సి ఉంటుంది.

– 450 చదరపు గజాల కంటే ఎక్కువ ఆక్రమిత స్థలంలో ఇల్లు కట్టుకొని ఉంటే వారు దారిద్ర్యరేఖతో సంబంధం లేకుండా ప్రాథమిక విలువలో 500 శాతం చెల్లించి రిజిస్ట్రేషన్ ఖర్చులు పూర్తిగా భరించాల్సి ఉంటుంది. నిర్ణీత వ్యవధిలోపు క్రమబద్ధీకరించుకోకుంటే తహసీల్దార్, రెవెన్యూ అధికారులు ఆక్రమణల తొలగింపు చర్యలు చేపడతారు.

దరఖాస్తు ఇలా చేసుకోవాలి...

ఆక్రమిత స్థలాల్లో ఇంటి నిర్మాణం చేపట్టినవారు గ్రామ, వార్డు సచివాలయాల్లో భూపరిపాలనా కమిషనర్ సూచించిన ప్రొఫార్మా మేరకు 2025 డిసెంబరు 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకొని కంప్యూటర్ జనరేటెడ్ రశీదు పొందాలి. దరఖాస్తులను సబ్ డివిజన్ స్థాయి ఆమోద కమిటీ పరిశీలించి నిర్ణయం తీసుకుంటుంది. వారు ఉత్తర్వు ఇచ్చిన నాటి నుంచి 30 రోజులలోపు కలెక్టర్‌కు అప్పీల్ చేసుకునే వీలుంటుంది.

బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

నింద్ర: బాలింతలు, కిషోర బాలికలు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్ వైజర్ శ్యామల తెలిపారు. మండలంలోని అగరం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రోగాలు రాకుండా నివారించవచ్చన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు.

మెనూ పాటించాలి


భోజనాన్ని రుచి చూస్తున్న ఎంపీడీఓ

పాలసముద్రం: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మెనూ పాటించాలని ఎంపీడీఓ క్రిష్ణమహేష్ రెడ్డి తెలిపారు. గురువారం నరసింహపురం ప్రాథమిక పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు.తాజా కూరగాయలతో పాటు రసం, సాంబార్‌లకు అయోడిన్ ఉప్పు వాడాలని సూచించారు.

సారా విక్రేత అరెస్టు


సారా విక్రయిస్తున్న వ్యక్తితో సీఐ, సిబ్బంది

నగరి: పట్టణంలోని నగరి దళితవాడలో గురువారం సారా విక్రయిస్తున్న ఉదయ్ అలియాస్ బెంజమెన్‌ను అరెస్టు చేసినట్టు చిత్తూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సత్యనారాయణ తెలిపారు. కాలనీలో సారా విక్రయిస్తున్నట్లు సమాచారం మేరకు దాడి చేశామన్నారు. అతని నుంచి 22 సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఆయన వెంట సీఐ సుబ్రమణ్యం, సిబ్బంది ఉన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి


విజయవాడలో ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసిన జీడీ నెల్లూరు సమన్వయకర్త కృపాలక్ష్మి దంపతులు

కార్వేటినగరం: గెలుపోటములు సహజమని, ప్రజలకు అందుబాటులో ఉండాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అన్నారు. గురువారం వైఎస్సార్‌సీపీ జీడీ నెల్లూరు నియోజకవర్గం సమన్వయకర్త కళత్తూరు కృపాలక్ష్మి, అనిల్ దంపతులు ఎంపీ మిథున్‌రెడ్డిని విజయవాడలో ఆయన నివాసంలో కలిశారు. ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పోరాటం చేసేందుకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని, అందుకు సిద్ధం కావాలని సూచించారు.

చెరకు రైతుల సమస్యలు పరిష్కరించండి


కలెక్టర్‌ను కలిసిన చెరకు రైతులు, నాయకులు

నింద్ర: మండల కేంద్రమైన నింద్రలో వున్న నేతమ్స్ షుగర్ ఫ్యాక్టరీ రైతులకు ఇవ్వాల్సిన బకాయిలను వెంటనే అందించేలా చూడాలని రైతులు కోరారు. వారు గురువారం జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీకి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఫ్యాక్టరీ వేలం వేయడానికి ఎస్టీసీఐ ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు నాలుగుసార్లు నోటీసులు ఇచ్చారని తెలిపారు. వేలంలో పాల్గొనేందుకు ఎవరూ ముందుకు రాలేదన్నారు. ఫ్యాక్టరీని త్వరితగతిన విక్రయించి తమకు బకాయిలు ఇప్పించాలని కోరారు. నాయకులు నారాయణ రెడ్డి, శ్రీనివాసు యాదవ్, సుదర్శన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త మృతికి నివాళి


నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి సోదరులు కుమారస్వామి రెడ్డి

పుత్తూరు: మండలంలోని గోపాల కృష్ణాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త రాజేష్ అకాల మరణం పొందారు. మాజీ మంత్రి ఆర్కేరోజా సోదరులు కుమారస్వామి రెడ్డి గురువారం గోపాలకృష్ణాపురం వెళ్లి రాజేష్ భౌతికకాయంపై పూలదండలు వేసి నివాళులర్పించారు. మృతుని సోదరుడు వైఎస్సార్ సీపీ నేత సురేష్‌ను ఓదార్చారు. కుటుంబానికి పార్టీ తరపున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పార్టీ రూరల్ కన్వీనర్ అన్నాలోకనాథం, నాయకులు చిరంజీవి, దాసు, దేవేందర్ రెడ్డి, రామ్ బత్తయ్య, మునిరాజు, శ్రీనివాసులు రెడ్డి, గోపి, దిలీప్, సెక్రటరీ చిరంజీవి, షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక


ఏపీ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

నగరి: ఏపీ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్– 3045కు నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. నగరిలో గురువారం నిర్వహించిన డివిజన్ స్థాయి సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాకర్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నగరి డివిజన్ అధ్యక్షులుగా ఓ.మూర్తి, కార్యదర్శిగా బి.హరికృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎ.వర్మ నగరి సెక్షన్ అధ్యక్ష, కార్యదర్శులుగా ఓ.ప్రవీణ్‌కుమార్, టి.సునీల్, నగరి రూరల్ సెక్షన్ అధ్యక్ష, కార్యదర్శులుగా జనార్దన్, ధర్మేష్, నింద్ర సెక్షన్ అధ్యక్ష, కార్యదర్శులుగా శివ, చిరంజీవి, విజయపురం సెక్షన్ అధ్యక్ష, కార్యదర్శులుగా జానకి, దాము, కమిటీ సభ్యులుగా పాండియన్, మురళీ, మునిశేఖర్, వెంకటేశు, మారిముత్తు, విజయ్ కుమార్, పాండియన్, అశోక్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా ఉన్న విద్యుత్ కార్మికులను వెంటనే రెగ్యులర్ చేయడం, మృతిచెందిన కార్మికుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకము కింద ఉద్యోగం కల్పించడం, భీమా లేని ప్రదేశాలలో సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కార్మికులను క్షేత్రస్థాయిలో నిషేధించే అంశాలపై పోరాటం సాగిస్తామన్నారు.

గడువు లోపు పనులు పూర్తి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న సుబ్రమణ్యం

పెనుమూరు(కార్వేటినగరం): నిర్దేశించిన ఉపాధి పనులు గడువులోపు పూర్తి చేయాలని చిత్తూరు క్లస్టర్ సహాయ పథక సంచాలకుడు సుబ్రమణ్యం అన్నారు. పారమ్‌పాండు పనులను ప్రతి గ్రామ పంచాయతీలో మార్చిలోపు కనీసం పది పూర్తి చేయాలని, ఏప్రిల్ నుంచి జూన్ వరకు అదనంగా మరో 10 పనులు పూర్తి చేయాల్సి ఉందన్నారు. అనంతరం ఎంపీడీఓ నీలకంఠేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో కనీసం వంద మందికి ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు ప్రోగ్రాం అధికారి డాక్టర్ గుణశేఖర్, జూనియర్ ఇంజినీర్ అనూష, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి వితరణ


సామగ్రి అందజేస్తున్న దాతలు

విజయపురం: మండల కేంద్రమైన విజయపురంలో ఉన్న జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు 48 మందికి గురువారం రిటైర్డ్ హెచ్ఎం చంద్రయ్య, కే రామచంద్రరాజు పరీక్ష సామగ్రి అందజేశారు. వారు మాట్లాడుతూ పరీక్షలు బాగా రాసి మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. హెచ్ఎం శ్యామల, ఉపాధ్యాయులు రవి, ధరణి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి


బహుమతులు అందిస్తున్న ఎంఈఓ

శ్రీరంగరాజపురం: సమాజంలో పురుషులతో సమానంగా మహిళలు ఆర్థికంగా ఎదగాలని మండల విద్యాశాఖ అధికారి సబర్మతి అన్నారు. మండలంలోని 49 కొత్తపల్లిమిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముందస్తుగా మహిళా దినోత్సవం నిర్వహించారు. విద్య ద్వారానే సమాజంలో అసమానతలు తొలుగుతాయన్నారు. ప్రతి ఒక్కరూ చదువుకొని ఉన్నత స్థానానికి చేరుకోవాలన్నారు. స్త్రీల అభివృద్ధి కోసం ఎంతో మంది సంఘ సంస్కర్తలు కృషి చేశారన్నారు. పాఠశాలలో పనిచేసే వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా రోడ్డు పనులు


గొల్లపల్లికి వెళ్లే రోడ్డు ఇలా..


ఆదిఆంధ్రవాడ చెందిన శ్మశానం రోడ్డు


ఊరుకి సంబంధించిన శ్మశానం రోడ్డు

విజయపురం: అధికారాన్ని అడ్డుపెట్టుకుని కూటమి నేతలు రెచ్చిపోతున్నారు. నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. మండలంలోని పలు గ్రామాలకు మంజూరైన రోడ్డు పనులను తూతూమంత్రంగా చేపట్టి ప్రజా ధనాన్ని స్వాహా చేశారు. గతంలో ఉన్న రోడ్డుపై గ్రావెల్ వేసి చదును చేసి కొత్తగా రోడ్డు వేసినట్లు బిల్లులు చేసుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వంలో పాతర్కాడు వెలుగు బాట నుంచి గొల్లపల్లి వరకు, ఆదిఆంధ్రవాడ శ్మశానం రోడ్డు, ఊరు శ్మశ్మానం రోడ్డు మంజూరయ్యాయి. ఎన్నికల కోడ్ రావడంతో పనులు చేపట్టలేదు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి నేతలు గతంలో రోడ్డుపై వేసిన మట్టి, కంకరను అక్కడక్కడా చల్లి చదును చేశారు. కొత్తగా రోడ్డు వేసినట్లు కలరింగ్ ఇచ్చి బిల్లు చేసుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తూ బిల్లులు చేస్తూ కూటమి నేతలకు సహకరిస్తున్నారని విమర్శిస్తున్నారు. దీనిపై వివరణ కోరడానికి పీఆర్ ఏఈకి ఫోన్ చేయగా ఆయన స్పందించలేదు.